


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఆదిలాబాద్


మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

బుధవారం 16 జులై 2025 పేజీలు 05




# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**లక్షేటిపేట,సూర్య మేజర్ న్యూస్ :** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల తహాశిల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన రేషన్కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమసాగర్రావు, తహాశిల్దార్ దిలీప్ కుమార్ లతో కలిసి లబ్దిదారులకు రేషన్కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించడం జరుగుతుందని తెలిపారు.రేషన్ కార్డులు లేకుండా అర్హత కలిగిన వారు మీ-సేవ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని,వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి వివరాలను ప్రభుత్వానికి నివేదిక అందించడం జరుగుతుందని, దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఒక కుటుంబానికి సంబంధించిన రేషన్కార్డులో ఉన్న వారు ప్రత్యేక కార్డు కావాలనుకుంటే ముందుగా తమ వివరాలను పాత కార్డులో తొలగించుకొని నూతన రేషన్కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.డిసెంబర్-2024లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్కార్డు కొరకు తీసుకున్న వివరాలను డిజిటలైజ్ చేయడం జరిగిందని, జనవరి 26, 2025 నుండి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి నూతన రేషన్కార్డు కొరకు దరఖాస్తుల స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఇందులో దాదాపు 21 వేల దరఖాస్తులను ఆమోదించడం జరిగిందని, 9 వేల రేషన్కార్డులను సర్దుబాటు చేసి 3 వేల దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించడం జరిగిందని,సంబంధిత అభ్యర్ధులకు సమాచారం అందించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 2 వేల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.లక్షెట్టిపేట మండలంలో 1 వేయి 538 నూతన రేషన్కార్డులు అందించడంతో పాటు 2 వేల 84 మందిని రేషన్కార్డులలో చేర్పించి సర్దుబాటు చేయడం జరిగిందని తెలిపారు.పంచాయతీ కార్యదర్శులు / మున్సిపల్ సిబ్బంది విచారణ కొరకు వస్తారని, వివరాల సేకరణ అనంతరం అర్హులకు రేషన్కార్డులు అందించడం జరుగుతుందని తెలిపారు. 3 నెలలు జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించి ప్రజాపంపిణీ వ్యవస్థలో



( మిగితా...2లో )

# భూసారా పరీక్ష పత్రములు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్(నార్నూర్) సూర్య మేజర్ న్యూస్**
వ్యవసాయ శాఖ , ఇఫ్కో వారి ఆధ్వర్యంలో నానో



యూరియా ప్లస్, నానో డిఏపి పై అవగాహన సదస్సు ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కో-ఆపరేటివ్ లిమిటెడ్ మంగళవారం నార్నూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొని భూసార పరిరక్షణ పథకం,భూసార పరీక్ష విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులందరు మట్టి పరీక్షలు చేయించుకోవాలని,పరిక్షల అనుసారం ఎరువులు వాడలని తెలిపారు.త్వరలోనే ప్రతీ గ్రామంలో సోయిల్ హెల్త్ అవేర్నెస్ క్యాంపెయిన్ చెస్తామని, అట్టి కార్డు యూస్ ప్రోగ్రాంకు రైతులు రావలని కోరారు.సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ అంటే, రైతుల భూమి యొక్క ఆరోగ్య స్థితిని తెలుసుకోవడానికి, నేల పరీక్షలు నిర్వహించి, ప్రతి రైతుకు వ్యక్తికరించిన మట్టి ఆరోగ్య కార్డులను అందించడం ఈ కార్డులలో నేల యొక్క బలాలు, బలహీనతలు, సూక్ష్మపోషకాల ( మిగితా..లో )

### మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి

# ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల బ్యూరో,సూర్య మేజర్ న్యూస్:** మహిళల సంక్షేమం, ఆర్థికి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల ప్రాంతంలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా భవన్ నిర్మాణ పనులను సందర్శించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం కొరకు అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా క్యాంటీన్ల ఏర్పాట్లు, పెరటి కోళ్ళ పెంపకం, డైరీ ఫామ్ ఇతర వ్యాపార అవకాశాలు కల్పించడంతో పాటు పెట్రోల్ బంక్ ఏర్పాటును ప్రోత్సహిస్తుందని తెలిపారు. జిల్లాలోని దండేపల్లి మండలంలో మహిళలకు చేయూతనిస్తూ ఇందిరా మహిళా శక్తి సోలార్ పవర్ప్లాంట్ ఏర్పాటుకు శంఖుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. ఇందిరా మహిళా భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు, గుత్తేదారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. ( మిగితా...2లో )

# కుళ్లిన గుడ్ల పంపిణీపై ఆరా

**వాంకిడి జూలై 15,సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని జైత్పూర్ అంగన్వాడీ కేంద్రంలో కుళ్లిన గుడ్లు పంపిణీ చేశారంటూ ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఐసిడిఎస్ పిడి భాస్కర్ మంగళవారం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేంద్రంలోని గుడ్లు, తదితర సరుకులకు సంబంధించిన స్టాక్ వివరాలు పరిశీలించారు. సరుకుల పంపిణీ చేసే ముందు నాణ్యత ప్రమాణాలు పరిశీలించాలని అంగన్వాడీ టీచర్ను ఆదేశించారు. సరుకుల నాణ్యతలో ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తనకు సమాచారం అందిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



# అఖరీఫ్ పంటకు ప్రాజెక్టు నుండి నీటిని వదిలిన ఎమ్మెల్యే

## - రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి

## - ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**కడెం,జూలై 15, సూర్య మేజర్ న్యూస్ :** రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కడెం ప్రాజెక్టు ఎడమ కాలువ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,రైతులు ఖరీఫ్ సీజన్లో సకాలంలో పంటలను పండించాలన్నారు.కడెం ప్రాజెక్టు మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం 9కోట్ల 46 లక్షలు ఖర్చు చేసిందన్నారు.త్వరలో పూడికను తొలిగిస్తామని తెలిపారు. ప్రాజెక్ట్ రోడ్డుకు మరమత్తులు చేపడతామని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అనంతరం మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల వద్ద సెప్టిక్ ట్యాంక్ పనులకు భూమి పూజ చేశారు.



### విద్యా రంగాన్ని మెరుగు పరుస్తున్నాం

నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోలార్ పెన్సిగ్ పనులకు భూమి పూజ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని మెరుగుపరచడానికి పాఠశాల,కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. వేరు వేరుగా జరిగిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### డివన్ పట్టాలపై క్షేత్రస్థాయిలో

# సర్వే చేపట్టాలి

### - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని డివన్ (డి-1) పట్టాల జారీపై మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డి వన్ పట్టాలపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టే అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. భూ హక్కులపై స్పష్టత కలిగేలా దరఖాస్తుల పరిశీలనలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులను భూభారతి పోర్టల్‌లో వెంటనే అప్డేట్ చేయాలని, వీలైనంత ఎక్కువ అప్లికేషన్లను త్వరితగతిన డిస్పోజ్ చేయాలని



తహసీల్దార్లకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దారు, సర్వే శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మొదటి పేజీ తరువాయి..**

చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఉచితంగా అందించడం జరిగిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని 10 లక్షల రూపాయల వరకు పెంచడం జరిగిందని, ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో లబ్దిదారులకు ఇండ్లు అందించడం జరిగిందని,ఇంకా మూడు విడతలు ఉన్నాయని, పి.వి.టి.జి., ట్రాన్స్ జెండర్లు, ఎస్.టి. అందరికీ ప్రత్యేకంగా ఇవ్వడం జరుగుతుందని,లబ్దిదారులు తమకు కేటాయించిన ఇండ్లను నిబంధనలకు లోబడి త్వరగా నిర్మించుకోవాలని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని, సొంత ఇంటి స్థలం ఉండి అర్హత గల వారు ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత పంపిణీ, 500 రూపాయలకు రాయితీ గ్యాస్ సిలిండర్ కొరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం / మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, అభ్యర్థులు రేషన్కార్డు, విద్యుత్



బిల్లు తీసుకువచ్చిన ఈ-పాస్ ద్వారా అనుసంధానం చేసినట్లయితే పథకం అమలు అవుతుందని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రజావాణి కార్యక్రమానికి రావచ్చని, ఆధార్ అనుసంధానమైన బ్యాంక్ ఖాతాలో గ్యాస్ రాయితీ జమ చేయడం జరుగుతుందని, అర్హత కలిగి రాయితీ పొందని వారు దరఖాస్తు చేసుకున్నట్లయితే పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరోజ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### భూసారా పరీక్ష పత్రములు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**మొదటి పేజీ తరువాయి...**

పంటలకు అవసరమైన ఎరువుల సిఫార్సులు ఉంటాయి. సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ యొక్క ముఖ్య ఉద్దేశాలు భూమి ఆరోగ్య స్థితిని తెలుసుకోవడంనేల పరీక్షల ద్వారా, భూమిలో ఉన్న పోషక పదార్థాల స్థాయిలు, విలువ, సేంద్రియ పదార్థాల శాతం వంటి ముఖ్యమైన విషయాలను తెలుసుకోవచ్చు. వ్యక్తిగతీకరించిన ఎరువుల సిఫార్సులు నేల ఆరోగ్య కార్డులో పంటలకు అవసరమైన ఎరువుల సిఫార్సులు ఉంటాయి, తద్వారా రైతులు అవసరమైన మొత్తంలో మాత్రమే ఎరువులను ఉపయోగించవచ్చు, ఇది అధిక ఖర్చులను తగ్గిస్తుంది మరియు భూమి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఉత్పాదకతను పెంచడం సరైన ఎరువుల వాడకం మరియు భూమి నిర్వహణ ద్వారా పంటల ఉత్పాదకతను పెంచవచ్చు. పర్యావరణ పరిరక్షణ అవసరమైన దానికంటే ఎక్కువ ఎరువులు వాడటం వలన పర్యావరణానికి హాని కలుగుతుంది, సాయిల్ హెల్త్ కార్డుల ద్వారా ఎరువుల వాడకం తగ్గించడం వలన పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు. రైతుల ఆదాయాన్ని పెంచడం అధిక దిగుబడి మరియు ఖర్చులను తగ్గించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడానికి సహాయపడుతుంది అన్నారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా వ్యవసాయ అధికారి బి. శ్రీధర్ స్వామి , జిల్లా ఉద్యాన వన అధికారి సుధాకర్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ శ్రీధర్ చౌహన్ , సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్. రాజశేఖర్, సోయిల్ సయిన్స్ 'ప్రొఫెసర్ : ప్రవీశ్ కుమార్,రవీందర్, ఎంఆర్ఓ,ఎంపీడీఓ, తదితరులు పాల్గొన్నారు.

### మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి

# ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మొదటి పేజీ తరువాయి...**

ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, అదనపు గదులు ఇతర సకల సదుపాయాలు కల్పించడం జరిగిందని, అనుభవజ్ఞులైన, నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యాబోధన అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాల సాధన దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీ సమయంలో తాజా కూరగాయలు, నిత్యావసర సరుకులు వినియోగించాలని, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యార్థినులతో మాట్లాడుతూ పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### హలో అమ్మా... నాన్న

# బాగున్నారా..?






**● గురుకుల పాఠశాలల్లో 'ఫోన్ మిత్ర' ● విద్యార్థుల సంఖ్యను బట్టి ఫోన్ల ఏర్పాటు ● పిల్లలకు తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం ● సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్**

**లక్షెట్టిపేట,సూర్య మేజర్ న్యూస్**

**ప్రత్యేక కథనం :**

తల్లిదండ్రులకు దూరంగా, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఇంటిపై బెంగతో ఇబ్బంది పడుతుంటారు. తల్లిదండ్రులతో ప్రతీ రోజు మాట్లాడాలని అనుకుంటుంటారు. కానీ ఫోన్ సౌకర్యం అందుబాటులో లేదని బాధపడుతుంటారు. వారి ఆవేదనను గుర్తించిన ప్రభుత్వం 'ఫోన్ మిత్ర' కార్యక్ర మానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం ఆరంభంలోనే విద్యార్థుల సంఖ్యను బట్టి టెలిఫోన్లను ఏర్పాటు చేసింది.

**ప్రతీ రోజు 2 గంటలు**

స్మార్ట్ కార్డుల ద్వారానే విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసే అవకాశం ఉంటుంది. ప్రతీ రోజు 2 గంటలు మాట్లాడుకోవచ్చు. ఒక్కో కార్డును ఐదు గురు విద్యార్థులు వినియోగించుకోవచ్చు. ఒక విద్యార్థి ఐదు నిమిషాలు మాట్లాడవచ్చు. ఇలా రోజుకు ఒక తరగతి చొప్పున ఎంపిక చేసి మాట్లాడే అవకాశాన్ని ఇస్తున్నాం. అందుకోసం కార్డుల్లో విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లను నమోదు చేస్తారు. దీంతో పాటూ ఒక టోల్ ఫ్రీ నెంబర్ (గురుకుల అధికారి) కూడా ఉంటుంది. విద్యార్థులకు ఏ సమస్యలు ఎదురైనా ఈ నెంబర్ కు ఫోన్ చేసి చెప్పవచ్చు.

**గురుకులాల్లో 'ఫోన్ మిత్ర సేవలు'**

లక్షెట్టిపేట లోని బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో 680 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారందరికీ 'ఫోన్ మిత్ర' సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దీంతో విద్యార్థులు ప్రతీ రోజు తల్లిదండ్రులతో మాట్లాడుకునే అవకాశం ఉంటుంది. ప్రతీ రోజు క్షేమ సమాచారాలు తెలుసుకోవచ్చని అంతే కాకుండా పిల్లలు ఇంటిపై బెంగ పెట్టుకొని మానసిక ఒత్తిడికి గురికాకుండా చదువుపై శ్రద్ధ పెంచుకొని ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. దీనివల్ల గురుకులాల్లో ఉత్తీర్ణత శాతం పెరుగుతుంది. భవిష్యత్‌లో గురుకులాల ప్రాధాన్యత ఇంకా పెరుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురుకులాల పట్ల తీసుకున్న అతి పెద్ద నిర్ణయం పట్ల అటు కుటుంబ సభ్యులు, ఇటు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**మానసిక ఒత్తిడి తగ్గుతుంది.**

**- రమా కళ్యాణి, తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, లక్షెట్టిపేట**

విద్యార్థులు ఇంటికి దూరంగా ఉండాల్సి రావడంతో మానసిక ఒత్తిడికి లోనవుతుంటారు. గురుకులాల్లో ఏర్పాటు




చేసిన ఫోన్లలో ప్రతీ రోజు తల్లిదండ్రులతో మాట్లాడటంతో ఒత్తిడి తగ్గి చదువుపై ధ్యాస పెరుగుతుంది. ప్రతి తరగతికి ఒక రోజు చొప్పున అన్ని తరగతుల విద్యార్థులు తమకు కేటాయించిన సమయంలో ప్రతీ రోజు ఐదు నిమిషాల పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడుకోవచ్చు. పిల్లలతో తల్లితండ్రులు లేదా పెంచుకునే వారు మాత్రమే మాట్లాడవచ్చు. ప్రతి రోజు సాయంత్రం 4 గంటల 30 నిమిషాల నుండి 6 గంటల 30 నిమిషాల వరకు వారు మాట్లాడుకునే సమయాన్ని కేటాయించాము. సొసైటీ చరిత్రలో ఇంత వరకు లేని సౌకర్యాన్ని ఈ ప్రభుత్వం అందించడం చాలా ఆనందాన్ని కలిగిస్తుంది.

**ప్రభుత్వం పిల్లల పట్ల చేసిన ఆలోచన హర్షణీయం.**

**- ముంజం సంతోష్, విద్యార్థిని తండ్రి, మంచిర్యాల**



ఇది వరకు ఎప్పుడో నెలకు ఒకసారి మా పాపను కలవడానికి వీలు ఉండేది. ఏది అయిన అప్పుడే మాట్లాడటం కానీ ఇప్పుడు అలా కాకుండా పిల్లలపై మేము, మాపై పిల్లలు బెంగ పెట్టుకోకుండా 'ఫోన్ మిత్ర' అనే సౌకర్యం ద్వారా వారానికి ఒకటి రెండు సార్లు మా పాపతో మాట్లాడే అవకాశం దొరికింది. ఈ అవకాశం పిల్లలకు మాకు మానసిక ప్రశాంతతను కలుగజేస్తుంది. ప్రభుత్వం పిల్లల పట్ల చేసిన ఆలోచన హర్షణీయం.

# ఆర్ టి సి బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే వినోద్




**భీమిని,సూర్య మేజర్ న్యూస్:**
భీమిని మండల కేంద్రానికి అర్ టీ సి బస్ రావటం తెలియని వారు ఇప్పుడే కొత్తగా బస్ ప్రారంభం అయినది అని అను కొంటారు సహజమే ఎందు కంటే బస్ నూ ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంబించారు కాబట్టి, కానీ ఇదేం కొత్త కాదు నాలుగు రోజులు నడిపించటం ఆతర్వాత నిలిపుదలచేయం మామూలే కానీ ఇప్పుడు ఎమ్మెల్యే ప్రారంభించాడు కనుక శాపం ఇప్పటి తో నైనా వి మో చన అయ్యేనా అని ప్రజలు అనుకొంటున్నారు, గతం లోకి వెళితే అది 1987 ప్రాంతం లో ఆసిఫాబాద్ ఇప్పటి కొమురం భీం జిల్లా కేంద్రం నుంచి రాంపూర్ వరకు బస్సు వచ్చేది వర్ష కాలములో కొన్ని సార్లు అచ్చులాపూర్ వరకు మాత్రమే వచ్చేది భీమిని కి రావాల న్న పోవాలన్న అచ్చా లాపూర్ ఆర్రే రాంపూర్ వాగు, బిట్టుపల్లి ఒర్రే, భీమిని వాగు, దాటి వర్షాకాలంలో భీమిని కి చేరుకునే వారు ..అలా ఓ రోజంతా బస్సు ఎక్క టానికే సమయం గడిచేది కాలక్రమేణా 1990 ప్రాంతంలో బెల్లంపల్లి నుంచి ఓ ప్రైవేటు బస్సు నడిచేది.. ఆ తర్వాత ఆటోలు, జీపులు నడిచాయి, ఇప్పుడు ఆటోలను బెల్లంపల్లి నుంచి నడుఉతున్నారు, 70రూపాయల చార్జు వసూలు చేయటం జరుగు తున్నది, అది కుడా చిన్న ఆటో లో యేడుగురు ప్రయానీకులు ఉంటేనే ఆటో బెల్లంపల్లి నుంచి బయలు దేరుతుంది..లేదంటే ఎంగేజీచేసుకొని వారు అడిగినంత ఇచ్చి ప్రయానించే పరిస్థితి ఉంది, పేదవర్గాలు...అనేక ఇబ్బందులు పడితున్నారు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళకు ఫ్రీ రవాణా సౌకర్యం కల్పించటంతో...ఇప్పుడు ఈ ప్రాంత మహిళలు సంబరాలు చేసు కొంటున్నారు, ఇది యిలా ఉంటే... ఇప్పుడు రోడ్లు మెరుగు పడ్డాయి, ఐనా అర్ టి సి వారు బస్‌ను నడపటం లేదు ఎందుకు అనే ప్రశ్నలు వెలుపడేవి, ఇటీవల సూర్య పేపర్ లో సైతం రాను ..రాను ..అంటున్న ఆర్టీసి బస్సు.. అనే శీర్షికన వార్త ప్రచురితం ఐనది, ఇంకా పలు పత్రికలు సైతం వార్తలు రాశారు, ప్రజలు సైతం అనేక ఫిర్యాదులు చేసి నట్లు సమాచారం,మొన్న భీమిని మాజీ ఎంపిపీ శ్రీమతి పోతు రాజుల రాజేశ్వరి లక్ష్మణ్..అర్ టి సి అధికారులకు బస్సు నడపాలని వినతి పత్రం సైతం ఇచ్చారు..ఇన్నిటి తర్వాత బస్సు ప్రారంభం అయింది.ఇప్పటికైనా సక్రమంగా బస్ నడిపి ఈ ప్రాంత ప్రజలు సేవలు అందించాల పలువురు కోరుతున్నారు.

## నూతన ఎంపీడీవో శేఖర్‌ను సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు

**నేరడిగొండ జులై 15 సూర్య మేజర్ న్యూస్**
మండల నూతన ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన శేఖర్‌ను మండల బిఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వక కలిసి శాలువాతో సన్మానించారు. సన్మానించిన వారిలో సాబ్లె సంతోషి సింగ్, బోర్గా మాజీ సర్పంచ్ జాదవ్ పవన్, రాథోడ్ శేఖర్, బాక్రే లక్ష్మణ్ రాథోడ్




పాండు నకలుడు బొంతుకుల శ్రీను, పురుషోత్తం ప్రసాద్, బోదాష్ శంకర్ కుంచపు గోవిందు గోగుల సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## నస్పూర్ లో పోలేరమ్మ బోనాల వేడుకలు

నస్పూర్, జులై 15, సూర్య మేజర్ న్యూస్:
నస్పూర్ సి సి సి, ఆర్ కే 5 కాలనీ లో ఆషాఢ మాసం పోలేరమ్మ బోనాల జాతరను ఘనంగా జరుపుకున్నారు. రెల్లీ కుల సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఆర్కె 5 కాలనీ బ్యారెక్



నుండి పోలేరమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్ళారు. డప్పు చప్పుళ్ళ మధ్య శివసత్తుల పునకాలు, నృత్యాలు హెూరెత్తించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. రెల్లీ కులానికి చెందిన మహిళలు బోనాలతో తరలివచ్చి తమ కుల దైవం పోలేరమ్మకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో రెల్లీ కుల సేవా సంఘం సభ్యులు సింహాచలం, పాల్, ఈశ్వర్ రావు, ఎల్లయ్య, శ్రీనివాస్, రాజు, అప్పారావు, కనకరాజు, సత్తిబాబు, బీ అప్పారావు, త్రిమూర్తులు, లక్ష్మయ్య, గంగా, పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు అధిక యూరియా వాడకాన్ని తగ్గించాలి

### - జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్

**సోన్, జూలై 15 సూర్య మేజర్ న్యూస్:**
రైతులు అధిక యూరియా వాడకాన్ని తగ్గించాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసారు. రైతులకు నాణ్యమైన ఎరువులను అమ్మాలని సూచించారు. పలు రికార్డ్స్ లని తనిఖీ చేసారు . అలాగే కూచినపల్లి గ్రామంలో పలు పంట పొలాలను సందర్శిచడం జరిగింది. రైతులు మోటాదుకు మించి రసాయన ఎరువులను వాడుతున్నారని యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఏ విద్యాసాగర్, ఏవో వినోద్ కుమార్ రైతులు పాల్గొన్నారు.



## చాకచక్యంగా దొంగలను పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది

**శ్రీరాంపూర్, జూలై 15, సూర్య మేజర్ న్యూస్:**
శ్రీరాంపూర్ సెక్యూరిటీ సిబ్బంది సేవలు అబ్బుర పరుస్తున్నాయి. దొంగలను చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే నిమిషాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకొని స్క్రాప్, రాగి తీగలు దొంగల పాలవ్వకుండా సింగరేణి ఆస్తులకు రక్షణగా నిలుస్తున్న వారి సేవలు ఔరా అని పిస్తున్నాయి. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే5 గనిలో కేబుల్ అపహరించడానికి సోమవారం రెండవ షిఫ్ట్‌లో దొంగలు విశ్వ ప్రయత్నం చేశారు. గనిలోని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ వెంటనే అప్రమత్తమై జమ్మేధర్, ఏసిటిసి, ఎంటిఎఫ్ సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న సెక్యూరిటీ సిబ్బందిపై దొంగలు రాళ్ల వర్షం కురిపించారు. రాళ్ల దాడిలో ఇద్దరు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు గాయాల పాలయ్యారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది చాకచక్యంగా గని చుట్టూ నాలుగు వైపులా ఉండి దొంగలను ఒక వైపు పరిగెత్తించారు. గని బయటకు పరిగెత్తగానే అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది ముగ్గురు దొంగలను పట్టుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. దొరికిన ముగ్గురు దొంగలను పోలీస్ స్టేషన్ కు తరలించారు. విషయం తెలుసుకున్న ఏరియా జిఎం ఎం. శ్రీనివాస్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి సెక్యూరిటీ సిబ్బందిని అభినందించారు.



## చిన్నారులకు ఆరోగ్యశ్రీ పథకం

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**నిర్మల్ జులై 15, సూర్య మేజర్ న్యూస్.**
జిల్లాలోని చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ల (సీసీఎ ల్ ఎస్)లో వసతి పొందుతున్న చిన్నారులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు



జిల్లాలోని 44 మంది అనాథ చిన్నారులకు ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. దీంతో వారు ప్రభుత్వంతో పాటు గుర్తింపు పొందిన ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా ఏకంగా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు పొందే అర్హత కలిగారని తెలిపారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో అనాథ చిన్నారులకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసిన రెండవ జిల్లా నిర్మల్ కావడం గర్వకారణమన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే

# ప్రభుత్వ ధ్యేయం

### - మార్నింగ్ వాక్ తో నేరుగా ప్రజా సమస్యలు ఎమ్మెల్యే చెంతకు

**కడెం,జూలై 15, సూర్య మేజర్ న్యూస్ :**
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఎమ్మెల్యే మార్నింగ్



వాక్ కార్యక్రమాన్ని చేపట్టి, ఏళ్లుగా పరిష్కారం కానీ సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం కడెం మండల కేంద్రంతో పాటు పెద్దూరు గ్రామంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లి వారు ఎదురుకుంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగు పరుస్తామన్నారు. నాడు బీఆర్ఎస్ హయంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రజా ప్రభుత్వం హయంలో గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు.పింఛన్ రానీ వారికి త్వరలో పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఖానాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మా ప్రాణాలు పోయిన మా భూములను వదలం

### - నచ్చన్ ఎల్లపూర్, గొండుగూడ రైతులు
### - భూములకు హద్దు రాళ్ళు ఏర్పాటు చేస్తుండగా రైతుల మధ్య వాగ్వాదం

**కడెం,జూలై 15, సూర్య మేజర్ న్యూస్ :**
నిర్మల్ జిల్లా కడెం మండలం కొత్తమద్దిపడిగ శివారులో మైసంపేట్,రాంపూర్ గ్రామాలకు పునరావాసం కల్పించారు. అయితే పునరావాస గ్రామాల 94 మంది లబ్ధిదారులకు వ్యవసాయ భూముల పంపిణీ చేయడానికి మంగళవారం అటవీ, పోలీస్, రెవెన్యూ అధికారులు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లారు. వెళ్లిన అధికారులతో నచ్చన్ ఎల్లాపూర్, గొండ్ గూడ రైతులు వాగ్వాదానికి దిగారు. నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి, ఎఫ్డిఓ రేవంత్ చంద్ర ఆధ్వర్యంలో అటవీ అధికారులు రెవెన్యూ అధికారులతో కలిసి వారు పంపిణీ చేయనున్న, రెవెన్యూ భూములకు హద్దు రాళ్ళు వేస్తుండగా, గోండుగూడ రైతులు రెవెన్యూ,అటవీ అధికారుల కాళ్ళు మొక్కేందుకు కాళ్ళ మీద పడ్డారు. తమ గ్రామాల భూములు వారికి ఎందుకు ఇస్తారని, అధికారులు పంపిణీ చెసే భూమిని గతంలో తాము అటవీ భూమి కొట్టుకొని కేసులు సైతం నమోదు అయ్యాయని, ఈ భూమిలో పట్టాలు ఇస్తే తమకే ఇవ్వాలంటూ రైతులు డిమాండ్ చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య



తీవ్రవాగ్వాదం చోటు చేసుకుంది. మా ప్రాణాలు పోయినా మేము ఆ భూమిని వదులుకోమని అన్నారు. మైసంపేట్, రాంపూర్ పునరావాస రెండు గిరిజన గ్రామాల ప్రజలను అధికారులు హద్దులు చూపెడతాము , రమ్మని పిలవడంతో నచ్చన్ ఎల్లాపూర్ గోండు గూడ గిరిజన రైతులు, రాంపూర్,మైసంపేట్ పునరావాస గ్రామాల గిరిజన రైతులు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే అధికారులు ఎంత చెప్పినా వినకపోవడంతో రెండు రోజుల తర్వాత మళ్లీ హద్దులు ఏర్పాటు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

# వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ (నార్నూర్),సూర్య మేజర్ న్యూస్**

గుడిహత్నూర్ గ్రామంలో మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా వనమహోత్సవంలో భాగంగా ఆయిల్ పామ్ మొక్కలు నాటి ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ ను జిల్లా వ్యాప్తంగా 80 ఎకరాల్లో ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లాలోని 25 మంది రైతులు సుమారు 4000 మొక్కలను తమ పంట నాటడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయిల్ పామ్ గురించి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు లాభదాయకంగా ఉంటుందని , ప్రభుత్వం మొక్కలు, బిందు సేద్య పరికరాల పై రైతులకి రాయితీలను అందిస్తుందని ,తోట నిర్వహణ, అంతర పంటల యాజమాన్యం కొరకు 4200 ఒక ఎకరానికి,నాలుగు సంవత్సరాల పాటు అందిస్తుందని .. కావున ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు .నార్నూర్ ని హార్టికల్చర్ హబ్ గా తీర్చిద్దెందుకు ఉద్యాన శాఖ ధృడ సంకల్పం నీతి అయోగ్ (ఆస్పిరషనల్ బ్లాక్ ప్రోగ్రాము) కింద నార్నూర్ మండలం అభివృద్ధిలో ముందడుగు వేస్తోంది.



ఈ మార్గంలో ఉద్యాన వన శాఖ కీలకపాత్ర పోషిస్తోంది. రైతుల ఆదాయాన్ని పెంచే, పోషకాహార భద్రత కల్పించే దిశగా పలు పథకాల ద్వారా శాఖ ముందుకు సాగుతోంది.గత 3 సంవత్సరములు గా ఉద్యాన శాఖ ద్వారా రాయితీలు రైతులకి అందించబడ్డాయి. ఓ పి పథకం ద్వారా దాదాపు 100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టబడింది. ఇందుకోసం 27 మంది రైతులకు సుమారు రూ.14 లక్షల ప్రోత్సాహక రాయితీ మంజూరైంది.124 ఎకరాల్లో బిందు సేద్యం ద్వారా సాగు ప్రోత్సహించబడింది. ఇందుకోసం రైతులు రూ.25 లక్షల రాయితీ పొందారు. 5 ఎకరాల్లో అరటి సాగు చేపట్టబడుతుంది.2025-26 సంవత్సరానికి ప్రణాళిక 100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం10 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు ప్రోత్సాహం తుంపర సేద్యం, బిందు సేద్యంపై ప్రత్యేక దృష్టి ఈ ప్రణాళికను అమలు పరచే దిశగా ఆసక్తి ఉన్న రైతులను గుర్తించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. అలాగే, రైతులకు అవగాహన కల్పించేందుకు పలు అవగాహన కార్యక్రమాలు అదిలాబాద్ ప్రత్యేక చొరవతో నిర్వహించబడుతున్నాయి.ఈ కార్యక్రమంలో ,ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్ర, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి .సుధాకర్ ,డి ఏ ఓ శ్రీధర్ స్వామి, డి ఆర్ డి ఓ పిడి రవీందర్ రాథోడ్, ఎంఆర్ఓ ఉద్యాన ,వ్యవసాయ అధికారులు ,ప్రీ యూనిక్యూ కంపెనీ డీజీఎం మల్లేశ్వర రావు, సిబ్బంది బిందు సేద్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### - మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్

**ఖానాపూర్ సూర్య మేజర్ న్యూస్ :**

ఖానాపూర్ పట్టణానికి చెందిన వ్యాపారస్తులతో మంగళవారం వాసవి మాత ఆలయంలో పట్టణ వ్యాపారస్తులకు ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు . ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణ వ్యాపారస్తులు, ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని అన్నారు. ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను కొనుగోలు చేయకూడదని, వాటి వల్ల పర్యావరణం చెడిపోయి అనేక సమస్యలు వస్తాయని సూచించారు. వ్యాపారస్తులు మరియు ప్రజలు ప్రతి ఒక్కరు ఇట్టి విషయాలను గమనించాలని, ప్లాస్టిక్ వస్తువులను విక్రయించిన కొనుగోలు చేసిన చట్టా ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్,బుచ్చన్న,జితేందర్,యాదగిరి, మున్సిపాలిటీ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### - అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**ఖానాపూర్ ,సూర్య మేజర్ న్యూస్ :**

ఖానాపూర్ లోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో వన మహోత్సవం వాతావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పిలుపునిచ్చారు.జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఖానాపూర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భవిష్యత్ తరాలకు సురక్షిత పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ర నాయకులు విజయ్ శర్మకు విప్లవ జోహార్లు

### - బెల్లంపల్లి ఎస్ జి కే ఎస్ కార్యాలయ ఆవరణలో సంతాప సభ.

**బెల్లంపల్లి, జులై 15, సూర్య మేజర్ న్యూస్:**

మాకు విప్లవోద్యమ ఓనమాలు నేర్పించి, ఆ బాటలో ప్రయాణించి సమ సమాజ స్థాపన కోసం, దోపిడీ లేని సమాజం కోసం పనిచేయాలని దారి చూపిన రాజకీయ గురువుకి విప్లవ జోహార్లు. యుసిసిఆర్ఐ (యం.యల్) ముఖ్య (రాష్ట్ర) నాయకులు శిష్టా విజయ్(శర్మ)74. చాలాకాలంగా కిడ్నీ వ్యాధితో అవస్థపడుతూ డయాల్సిస్ పై ఉన్నారు. ఈనెల 12 తేదీన రాత్రి తన చివరి శ్వాస నొదిలారని సహచరుల ద్వారా తెలిసిందనీ, ఆ విషయం చాలా బాధాకరం అని యుసిసిఆర్ఐ (ఎమ్.ఎల్) ఏ. మహేందర్ జిల్లా కార్యదర్శి మాట్లాడారు. తదుపరి ఆయన మాట్లాడుతూఈ రోజున నేను నాలాంటి వాల్లెందరమో నేడు విప్లవ రాజకీయాలలో ఉన్నామంటే అది విజయ్ విప్లవ సైద్ధాంతిక రాజకీయ శిక్షణనే, సిద్ధాంత రాజకీయ బోధనలు, ఆయన నిర్మాణ కృషియే కారణం.ఆయన ఆకాంక్ష భారత జనతా ప్రజాతంత్ర విప్లవం దానికై ఆయన అమూల్యమైన కృషి చేసారు, ఆయన త్యాగం హిమాలయాల కంటే ఉన్నత మైనదనీ, ఆయన లేని లోటు భారత విప్లవానికి పూడ్చలేని లోటు అని, విజయ్ విప్లవ కృషికి శిరస్సు వంచి రెడ్ సెల్యూట్ చేస్తున్నామన్నారు. ఆయన బోధించిన విప్లవ నైతిక విలువలను ఈ జీవిత కాలమంతా పాటిస్తాం. అది కామ్రేడ్ విజయ్ కే అంకితం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో యు సి సి ఆర్ ఐ (ఎమ్మెల్) జిల్లా కార్యదర్శి ఏ. మహేందర్, ఏ. శంకర్, మరియు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎండి.చాంద్ పాషా, నవోదయ కళాకారుడు, ఎన్. రాజ్ కిరణ్ ఎస్ జి కే ఎస్ రాష్ట్ర నాయకులు, ఏం. మల్లేష్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నీరటి రాజన్న, టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. మనీ రామ్ సింగ్, సిపిఐ(ఎమ్మెల్) రెడ్ స్టార్ రాష్ట్ర నాయకులు గోగర్ల .శంకర్, ప్రజా ఫ్రంట్ జిల్లా కార్యదర్శి టి. జైపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కు అధికారాలు ఇవ్వండి

**బెల్లంపల్లి, జులై 15, సూర్య మేజర్ న్యూస్:**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పూర్తిగా అవినీతిలో కూరుకపోయినందువల్ల తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కు అధికార పగ్గాలను అప్పగించాలని మంచిర్యాల జిల్లా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఇన్చార్జి పైడిమల్ల నర్సింగ్ కోరారు. మంగళవారం రోజున ఆయన బెల్లంపల్లిలో పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు 170 కోట్ల రూపాయల అవినీతి కి పాల్పడినందువల్ల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిజాయితీ బయటపడిందని ఆయన విమర్శించారు. బీసీసీఐ ప్రతి ఏడాది 100 కోట్ల రూపాయలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కు అందజేస్తుందని అయితే ఈ నిధులను తెలంగాణలోని ఏ జిల్లాలో కూడా ఖర్చు చేయలేదని ఒకవేళ ఖర్చు చేస్తే ఏ జిల్లాలో టర్ఫ్ పిచ్ లను ఏర్పాటు చేశారు, ఎక్కడ మ్యాట్లు, నెట్లు ఏర్పాటు చేశారు, ఎంతమంది క్రీడాకారులకు శిక్షణ కార్యక్రమాలు ఇప్పించి వారిని పైకి తీసుకువచ్చారు చెప్పాలని ఆయన కోరారు. హెచ్. సి. ఏ మారుమూల ప్రాంతాల క్రీడాకారులను అసలు పట్టించుకోలేదని నిధులను వారే అవినీతికి పాల్పడి దుర్వినియోగం చేశారని పైడిమల్ల నర్సింగ్ విమర్శించారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కు అధికారం అప్పజెప్పితే తాము క్రీడాకారుల అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేసి వారిని అభివృద్ధిలోకి తీసుకు వస్తామని జిల్లాలో క్రీడా అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఆయన అన్నారు. అందువల్ల ఇప్పటికైనా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కు అధికార పగ్గాలను అప్పజెప్పాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా టి.సి.ఏ.కో ఆర్డినేటర్ అల్లం వెంకటేశ్వర్లు, కోచ్ లు జాడి శేఖర్,గౌతమ్ పాల్గొన్నారు.

## బౌద్ధ మంత్రాలతో జేత్వాన్ బుద్ధ విహార్లో బుద్ధుని పంచలోహ విగ్రహ ప్రతిష్ట

**వాంకిడి, జులై 15,సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని జేత్వాన్ బుద్ధ విహార్ లో మంగళవారం సాయంత్రం భగవాన్ గౌతమ్ బుద్ధుని పంచలోహ విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమం పరంపూజ్య బంతే భరద్వాజ్ గారి నేతృత్వంలో సాంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించబడింది.బుద్ధుని విగ్రహాన్ని జ్యోతిబాపూలే సంక్షేమ సంఘం భవనానికి దగ్గర నుండి జాతీయ రహదారిపై ఊరేగింపుగా తీసుకువచ్చారు. బౌద్ధ మంత్రోచ్చారణల మధ్య, బౌద్ధ ఉపాసకులు-ఉపాసికలు బుద్ధుని ప్రార్థనలు చేస్తూ ఈ విగ్రహాన్ని బుద్ధ విహార్లో ఉంచారు.34వ వర్షవాస్ కార్యక్రమాల ప్రారంభానికి అనుబంధంగా ఈ విగ్రహ స్థాపనను ఐదవ రోజు నిర్వహించామని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మావుల్కర్, సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు దుర్గం సందీప్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యులు: అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు దుర్గం దుర్గాజీ, గౌరవ అధ్యక్షుడు జై రామ్ ఉప్రే, ఉపాధ్యక్షులు దుర్గం సునీల్, శ్యామ్ రావు దొండుజి దుర్గే, కార్యదర్శి రోషను ఉప్రే, సమాజ అధ్యక్షుడు శ్యామరావు లహుజీ దుర్గే, మహిళా మండలి నాయకులు గంగుబాయి, విఠ్ఠబాయి, కలబాయి, కృపావాణి ,దుర్గం మనోజ్, చింటూ, స్వాగత్, వివేక్, అన్నారావు, భీమ్ రావు, లడ్డు, రమేష్, నూతన్, ప్రసాద్, ప్రశాంత్ జాడే తదితరులు పాల్గొన్నారు.

## రెండవ సారిగా బిజెపి మండల అధ్యక్షులుగా బోయిన్ వాడ్ అమోల్

**సిరికొండ ,సూర్య మేజర్ న్యూస్**

సిరికొండ మండల కేంద్రంలోని రెండోవ సారిగా బిజెపి మండల అధ్యక్షుడిగా బోయిన్ వాడ్ అమోల్ కు ఎన్నుకున్నారు ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు అధ్వర్యంలో శాలువాతో సత్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరికొండ మండల బిజెపి పార్టీ లో అందరితో కలిసి పనులు చేస్తూ పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్నాను అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పెందూర్ అమృత్ రావ్,బాలాజీ, మానిక్ రావ్, మారుతి సునీల్, పటేల్, గంగాధర్,నాందేవ్, తుకారాం, బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**కాసిపేట, జులై 15, సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని కాసిపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం



విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళా సాధికరిత సంస్థ ఆధ్వర్యంలో పోషణ పక్షం సెక్టార్ లెవల్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మహిళా సాధికారత సంస్థ హబ్ జెండర్ స్పెషలిస్ట్ విజయ,ఫైనాన్స్ లిటరసీ లిప్సికలు విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మామిడిపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలుగా మారకుండా ఉత్తమ అలవాట్లు నేర్చుకొని మంచి భవిష్యత్తు ను నిర్మించుకోవాలని సూచించారు. జిల్లా మహిళా సాధికారత సంస్థ సభ్యులు భేటీ బచావ్- భేటీ పడావ్ పథకం, బాల్యవివాహాల నిరోధక చట్టం, ఆన్లైన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, మహిళ హెల్ప్లైన్ 1930, 1098, చైల్డ్ హెల్ప్ లైను , మొదలగు విషయాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమణా రెడ్డి,అనురాధ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి గోడ గడియారాల బహూకరణ

**బెల్లంపల్లి, జులై 15, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి పట్టణం లోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కి డీ పీ పీ ఎస్, స్టాండర్డ్ వాచ్ కంపెనీ రెండు గోడ గడియారాలను బహూకరించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జీ డి. రవికుమార్ మాట్లాడారు. వైద్య సిబ్బందికి, వైద్యులకు, ఆస్పత్రికి వచ్చే రోగులకు గోడ గడియారం ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇవి బహూకరించిన వ్యాపారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది శ్రీనివాస్,ప్రవీణ్ కుమార్ సంఘ సేవకులు ఏల్పుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ చైర్మన్ గా మల్లెపూల నరసయ్య నియామకం

**నేరగొండ జులై 15 సూర్య మేజర్ న్యూస్**

అదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలానికి చెందిన మల్లెపూల నరసయ్య మాజీ జెడ్పిటిసి గా పనిచేశారు. సీనియర్ నాయకులైన మల్లెపూల నరసయ్యను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి గ్రంథాలయ చైర్మన్ గా మల్లెపూల నరసయ్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. బ జార్ హత్నూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ పదవులను భర్తీ చేస్తున్నందుకు సీఎం రేవంత్ రెడ్డికి జిల్లా మండల నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు.



## సోన్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా విద్యాధికారి రామారావు

**సోన్, జులై 15 సూర్య మేజర్ న్యూస్:**

మండల కేంద్రంలోని సోన్ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాధికారి రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అన్ని సౌకర్యాలు మెరుగుపరిచి, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, పాఠశాల అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించు కోవాలని




ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా పాఠశాల నమోదు వివరాలు తెలుసుకొని విద్యార్థుల నమోదు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని, వంటగది పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, వర్షాకాలం కాబట్టి మధ్యాహ్న భోజనం తయారీలో సరైన శ్రద్ధ వహించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలోని అందరు విద్యార్థులకు నిర్వహించవలసిన కార్యక్రమాలు సజావుగా నిర్వహించాలని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మెరుగుపరిచేందుకు తగిన కృషి చేయాలన్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులపై శ్రద్ధ పెట్టి, యూనిట్ వారి పరీక్షలు నిర్వహించి, వారిని ఇప్పటినుంచే పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు నర్సయ్య, లింబాద్రి, మండల విద్యాధికారి తొడిశెట్టి పరమేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆరాధన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిరసన తెలిపిన కాగజ్ నగర్ ప్రెస్ క్లబ్ సభ్యులు

**కాగజ్నగర్, జులై 15, సూర్య మేజర్ న్యూస్:**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఆదివారం కాగజ్నగర్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిజిస్టర్డ్ ప్రెస్ క్లబ్ సభ్యులు ఆదివారం రోజు తీన్మార్ మల్లన్న క్యూ న్యూస్ ఆఫీస్ పై జరిగిన దాడిని ఖండిస్తూ వెంటనే దాడికి పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించాలని నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. కాగజ్నగర్ పట్టణ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి ఈర్ల సతీష్ కుమార్ మాట్లాడుతూ విచక్షణారహితంగా జాగృతి




అనుచరులు మీడియా మిత్రులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలియజేశారు. రాజకీయ ప్రోత్సలంతో ఇటువంటి దాడులకు పాల్పడితే ముందు ముందు చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి దాడి చేసిన జాగృతి అనుచరుల పై చట్ట ప్రకారం కఠిన శిక్షలు విధించవలసిందిగా కోరారు, ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు (పల్లవి ) వర్ధాల వెంకన్న, ఆంజనేయులు, కదారి శ్రీనివాస్, మహమ్మద్ పాషా, ఫయాజ్. నసీర్ పట్టాన్,తీన్మార్ మల్లన్న టీం కొమురం భీం జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గ నిరంజన్ మండల అధ్యక్షుడు తాడిపల్లి వెంకటేష్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నపై దాడిని ఖండిస్తూ బిసి సంక్షేమ సంఘం నిరసన జ్వాల

**మందమర్రి, జులై 15, సూర్య మేజర్ న్యూస్**

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న క్యూ న్యూస్ కార్యాలయంపై జరిగిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అనుచరులు జరిపిన దాడిని ఖండిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందర మంగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిళ్ల శ్రీనివాస్, పట్టణ యూత్ అధ్యక్షులు ముదారపు శేఖర్ లు మాట్లాడుతూ కవిత ప్రోద్బలంతోనే ఆమె అనుచరులు, కార్యకర్తలు క్యూ న్యూస్ కార్యాలయంపై దాడికి పాల్పడ్డారని, మీడియా సంస్థలపై దాడులు చెయ్యడం సరికాదని అన్నారు. బీసీ ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపి, రేపు బిసి రాజ్యాధికారాన్ని సాధించే దిశగా



పయనిస్తున్న తరుణంలో బీసీ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న బీసీ నాయకుడు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చేసిన దాడి కేవలం ఆయనపై చేసిన దాడి కాదని యావత్ తెలంగాణలోని రెండు కోట్ల బీసీల పైన చేసిన దాడిగా అభివర్ణించారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో ఏనాడు బీసీల కోసం ఆలోచించని వాళ్ళు నేడు బీసీల పట్ల కపట ప్రేమను చూపిస్తూ, బీసీ బిడ్డ మీద చేసిన దాడిని ముక్త కంఠంతో ఖండించాలని కోరారు. తెలంగాణ యాస, భాషల పట్ల అవగాహన లేని వాళ్ళు నేడు బీసీ బిడ్డ చట్ట సభల్లో కూర్చుంటే ఓర్వలేక అనగ దొక్కే కుట్రలను తెలంగాణ సమాజం గమనిస్తుందని, ఇకనైన వారి వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం పట్టణ నాయకులు జాడ క్రాంతి కుమార్, పారుపెల్లి శివరామకృష్ణ, చింతల రమేష్, రెడ్డి అయిలయ్య, మొగిలిచెర్ల రాజేష్, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ సీ ఏ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

### -టి సి ఏ నిర్మల్ జిల్లా కోచ్ రామరాజ్

**నిర్మల్ జులై 15, సూర్య మేజర్ న్యూస్.**

కొన్నేళ్లుగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీ ఏ) లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ( టీసీఏ )నిర్మల్ జిల్లా కోచ్ రామరాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్ సీ ఏ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మోహన్ రావు, ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ప్రదీప్ పై గత కొన్ని ఏళ్లుగా వస్తున్న అవినీతి ,అక్రమాలు నిధుల దుర్వినియోగం పై తక్షణమే విచారణ చేపట్టి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని



డిమాండ్ చేశారు. గత 20 సంవత్సరాలుగా బీసీసీఐ, హెచ్ సి ఏ అభివృద్ధి కోసం మంజూరు చేసిన నిధులను ఏసీఏ కార్యదర్శి ప్రదీప్ దుర్వినియోగం చేసినట్లు బలమైన ఆరోపణలు ఉన్నాయన్నారు. హెచ్ సి ఏ బాధ్యుల అవినీతి అక్రమాల వలన యువ క్రికెటర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ రంగ సంస్థలు వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

## డివన్ పట్టాలపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలి

### -జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ జులై 15, సూర్య మేజర్ న్యూస్**

అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని డివన్ (డి 1) పట్టాల జారీపై మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా



కలెక్టర్ మాట్లాడుతూ, డి వన్ పట్టాలపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. భూ హక్కులపై స్పష్టత కలిగేలా దరఖాస్తుల పరిశీలనలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులను భూభారతి పోర్టల్‌లో వెంటనే అప్డేట్ చేయాలని, వీలైనంత ఎక్కువ అప్లికేషన్లను త్వరితగతిన డిస్పోజ్ చేయాలని తహసీల్దార్లకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దారు, సర్వే శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై సమీక్ష నిర్వహించిన జిల్లా ఎస్పీ జానకి షర్మిల

**నిర్మల్ జులై 15, సూర్య మేజర్ న్యూస్.**

ట్రాఫిక్ సమస్యల పై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశం. నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై జిల్లా ఎస్పీ డా: జి.జానకి షర్మిల జిల్లా పోలీసు అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష సమావేశం




నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అధికారులకు తగు సూచనలు చేసారు. ముఖ్యంగా మిస్సింగ్ కేసులు మరియు బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ 194 కింద ఉన్న కేసుల పురోగతిపై సమగ్రంగా ఆరా తీసారు. అంతే కాకుండా ప్రజలు ట్రాఫిక్ సమస్యల వల్ల తీవ్రంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ముఖ్యంగా గంజాయి వినియోగం పై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రతి కేసుపై సమగ్ర విచారణ జరిపి, విచారణను వేగవంతం చేసి కోర్టుల్లో సమర్థవంతంగా సమర్పించాలి" అని స్పష్టం చేశారు. విచారణలో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని పెండింగ్ కేసులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని, ప్రతి కేసుపై సమగ్ర నివేదికను సమర్పించాలని ఇన్స్పెక్టర్లకు మరియు ఎస్.హెచ్.ఓ లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్ష సమావేశం లో జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఐపిఎస్ తో పాటు,భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఐపిఎస్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన ఐపిఎస్, ఇన్స్పెక్టర్లు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్.హెచ్.ఓ లు హాజరయ్యారు.

## జులై 17న విశ్వనాథ మహర్షి సౌజన్యంతో ఆయుర్వేద వైద్య శిబిరం

**మందమర్రి, జులై 15, సూర్య మేజర్ న్యూస్:**

సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో పాటు పరిసర ప్రాంత వాసుల ఆరోగ్య సౌకర్యార్థం ఈ నెల 17 వ తారీఖున ఏరియాలోని సీఈఆర్ క్లబ్ లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కీళ్లు, మోకాళ్ల నొప్పులు, బిపి, షుగర్, పక్షవాతం, అజీర్ణం, మలబద్ధకం, అస్తమా, స్త్రీ సంబంధిత, దీర్ఘకాలిక వ్యాధులకు గురువారం ఉదయం 10 నుండి సాయంత్రం 6 గంటల వరకు సిఈఆర్ క్లబ్ లో (మాతా రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద, హైదరాబాద్) ఆయుర్వేద వైద్యులు విశ్వనాథ మహర్షి సౌజన్యంతో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని, ఈ వైద్య శిబిరానికి ఇంతకు ముునుపు హాజరైన వారు, కొత్తగా వైద్యం కోసం వచ్చే వారు అందరూ హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి యాజమాన్యం తెలిపారు.